# నీలి గోరింట

## నాయని కృష్ణకుమారి

ఇంటిముందు రకరకాల కార్లు రోడ్డుకు అటూ ఇటూ బారులు తీరి ఆగి ఉన్నయ్. గేటు కెదురుగా వాకిట్లో రోడ్డు మీద పిడకలు రాజేసిన నిప్పు నివురు కప్పి మసక మసకగా ఉంది. పిడకలమీదనుండి వచ్చే పొగను దాటుకుంటూ మనుషులు లోపలకీ బయటకీ నిర్విరామంగా పయనిస్తూనే ఉన్నారు. ఇంతమంది మనుషులు అటూ ఇటూ తిరుగుతున్నా అక్కడి వాతావరణంలో ఎక్కువ మాటా పలుకూ లేక, స్తబ్ధుగా, బరువుగా ఉంది. అందరి ముఖాల్లోనూ ఏదో చెప్పలేని నిస్సహాయత్వం—

o o o

"ఇంతమంది వస్తున్నారు. పూలమాలలతో ముంచేస్తున్నారు. నాకు నచ్చని ఈ అగరువత్తుల ధూపం వల్ల కాబోలు చుట్టూ ఉన్న వాళ్ళముఖాలు మసకబారి ఉన్నాయి. మామూలు రోజుల్లో నవ్వులు పేలుస్తూ తిరగేవాళ్ళు కూడా ఇంత బరువుగా దిగులుగా ఉన్నారేమిటి! అవతల కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుని చేతులు జోడించి వెక్కుతున్న అబ్బాయి రామూ కాదూ; నేను ఉద్యోగం ఇప్పించిన పిల్లవాడు! ఇక్కడ నుండి ఒక్క అడుగైనా అవతలకు కదలలేకుండా ఉన్నాను. ఎంతోమంది ఆడవాళ్ళు తోసుకుని వచ్చేస్తున్నారు. వీళ్ళంతా ఎప్పుడో ముప్పైయేళ్ళ కిందట, మేము కలిసి మెలిసి ఉన్న ఒక్క లోగిలిలోని వాటాల వాళ్లు. వీళ్ళందరకీ నేనంటే యిష్టమే. వీళ్ళు నిజంగానే దుఃఖపడుతున్నారు. పాపం సావిత్రి వాళ్ళను చూచి ఏడుపాపుకోలేకపోతూంది. దాన్ని ఎవరూ ఊరుకోబెట్టలేరు. ఒద్దన్నకొద్దీ దుఃఖం తన్నుకొస్తోంది. అది అంతే. అందరూ వద్దన్న పని విడవకుండా చెయ్యడమే దాని జీవితాదర్శం. ముప్పైయేళ్ళపాటు నా జీవితాన్ని పంచుకుంది. నోరు మెదపకపోయినా, నేను చేసే పనులకన్నిటికీ ఎంతో చాకచక్యంగా అయిష్టం చూపించేది. ఒక విధంగా నేనే దాని కయిష్టమైన పనులన్నీ చెయ్యాలని వెతుక్కునేవాణ్నేమో! అది నా మనస్సేమాత్రమైనా గ్రహించిందా! నా జీవితంలో, ఏది పెద్ద లోపమై, అగ్నిగుండంలా మండి, అనుక్షణమూ నన్ను కాల్చుకు తిన్నదో, ఆ లోపాన్ని [illegible]కు పూరించగలిగిందా? కనీసం అదేమిటో ఇప్పుడైనా నీకు తెలియదు కదా సావిత్రీ! ఆ సావిత్రి భర్తకోసం యముడితో యుద్ధం పెట్టుకుంది. ఈ సావిత్రి భర్త మనస్సులో ఏళ్ళతరబడి జరుగుతున్న యుద్ధాన్ని గుర్తుపట్టలేకపోయింది. ఈవిడ శరీరంలో అణువణువునూ నాలో కలుపుకున్నానుగాని, మనస్సులోకి తొంగిచూచే ప్రయత్నం



చెయ్యలేదు. తను జోరబడుతుందేమోనని భయపడి నా మనసు తలుపుల్ని గట్టిగా మూసేశాను. సావిత్రి తెలివి గలది. అవి గ్రహించే, నామీద కోపాన్ని, కసినీ మౌనంగా, నోరు మెదపకుండా, ప్రదర్శించే దనుకుంటాను ఇప్పుడు గుండెలు పగిలేలా ఏడుస్తోంది-ఉత్త పిచ్చిది. ఒకవేళ నేను తిరిగి వస్తే నా మనస్సుకు శాంతిని సావిత్రి యివ్వగలదా? లేదు, లేదు. ఆ శాంతి నిచ్చే వ్యక్తి సావిత్రి కానే కాదు.

ఏనాటి కథ! నలభై యేళ్ళ కిందటి మాట! ఆ ఊళ్ళో మట్టి ఎర్రగా ఉండేది. అప్పుడు నా మనస్సు కూడా ఎంత చిన్నపాటి ఆకర్షణకైనా రాగపూరిత మౌతుండేది. ఇంటిచుట్టూ విశాలమైన స్థలం. రాళ్ళూ రప్పలూ, పిచ్చిమొక్కలూ పెరిగి ఏదో అరణ్యంలో వనవాసం చేస్తున్నట్లుండేది. ఆ పిచ్చి మొక్కల్లో నీలిగోరింటలు మనోహరంగా గాలికి ఊగుతూ హాయిగా పలకరిస్తుండేవి. మూతిమీద నూనూగు మీసమూ, గరుగ్గా తగిలే ఎదిగీ ఎదగని గడ్డమూ, నన్ను ఇబ్బంది పెడుతూండేవి. అప్పుడే కాదూ నా బ్రతుకు స్మృతుల్లోకి ప్రవేశించిందో నీలి గోరింట! తర్వాత ఎన్ని సార్లు చూచాను! పెళ్ళికాని పడుచుపిల్లగా, పిల్ల తల్లిగా, ఇంటా బయటా సర్వమూ సంబాళించుకునే బాధ్యతగల ఉద్యోగినిగా గౌరవప్రదురాలైన స్త్రీని ఎన్ని దశల్లో చూచాను. ఆ నా ప్రాణాన్ని! ఒక్క ఊళ్ళో ఉంటూ ఎంత అంతరం నాకూ ఆవిడకూ మధ్య — ఇంత మంది, ఇక్కడికి వస్తూ పోతున్నారు. కాని ఏదీ ఆ మహారాణి రాదేం! ఆత్మ ఎక్కడికైనా ఎగరగలదంటారు. నేనీ గదీ వదల్లేక పోతున్నాను. రావూ? చివరిసారిగా ఈ దేహాన్ని చూడడానికైనా, నా ప్రాణమా, నువ్వు! తర్వాత పిండాన్ని కాకులు ముట్టకపోతే, తస్తి పంపకాల విషయంలో నాకు అసంతృప్తి అనుకుంటారు మూర్ఖ

○ ○ ○

ఆ యింటి ముందు వచ్చేపోయే వాళ్ళ సందడి అంత కంతకూ ఎక్కువై పోతోంది. ఇంటి యజమాని హటాత్తుగా పోయాడు. విశాలమైన గదిలో ఎత్తుగా బల్లమీద మంచు గడ్డలు పేర్చి, శవాన్ని ఉంచారు. శవంమీద కప్పిన తెల్ల గుడ్డ, భయానికి సంకేతంలా మెరుస్తోంది. శవం మీద చేమంతి దండట! గదినిండా ఊదొత్తుల వాసన, మనుషుల విచార వదనాలు, నీరసపు గొంతులు, అన్నీ కలిసి ప్రతివాళ్ళ మనస్సుల్లో తమ తమ అంతిమ యాత్రా ప్రయత్నాల ఊహల బొమ్మల్ని చెక్కుతున్నయ్. అప్పుడు గడపదాటి లోపలికి ప్రవేశించిందో యాభై యేళ్ళ ఆడమనిషి. ఆవిడ సన్నగా తెల్లగా ఉంది. ముక్కుకొనదేలి ఆ ముఖంలో స్థిరత్వాన్నీ, కార్యదీక్షనూ తెలియజేసే సాధనంగా ప్రకాశిస్తోంది. కళ్ళు చిన్నవైనా కళ గలవి. కొద్దిగా బొట్టు చెరగి, ముఖంలో హుందాతనం ప్రవేశించింది. ఆవిణ్ణి చూస్తే ఎవరైనా తెలివిగలదనుకుంటారు. సౌమ్యురాలైన మంచి మనిషను కుంటారు. ఆవిడ అక్కడున్న అందరికీ బాధ్యతగల వ్యక్తిగా పరిచయం. ఆవిడంటే అందరికీ గౌరవమే.

సావిత్రి ఆవిణ్ణి చూచి కుమిలి కుమిలి యేడ్చింది, ఆవిడకు సావిత్రిని సముదాయించడం ఎంతో కష్టమైపోయింది.

శవాన్ని పడుకోబెట్టిన చోటుకు ఎదురుగా గుమ్మంపైన ఒక పడుచుపిల్లవాడి ఫోటో ఉంది.

"ఇది మీ ఆయనదే కాదూ సావిత్రీ!" అన్నదావిడ.

"అవును. ఆయనకు ఇరవై యేళ్ళప్పటి ఫోటో" అని వెక్కుతూ చెప్పింది సావిత్రి


"ఈ వయస్సులో ఉన్నప్పుడే మీ ఆయన్ని నేను మొదటిసారి చూచాను తెలుసా? ఈ రూపం నాకు బాగా జ్ఞాపకం. అప్పుడు నాకెన్నేళ్ళనుకున్నావ్ సావిత్రీ! పద్నాలుగేళ్ళేమో! మీ ఆయన వాళ్ళ పిన్నివాళ్ళింట్లో చదువుకుంటుండేవాడు. వాళ్ళ పిన్ని భర్త మా మేనమామ. ఒక వేసవి సెలవల్లో అమ్మా వాళ్ళతో వాళ్ళ ఊరెళ్ళాను. ఆ యిల్లు ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపకం. చుట్టూ విశాలంగా చెట్టూ చేమలతో జీబురంటూ బోలెడంత ఖాళీ స్థలం. ఆ స్థలంలో నీలిగోరింట పూలు విరగబూచేవి. మీ ఆయన ఎక్కువ మనుషుల్లో కలిసేవాడు కాడు. మాట్లాడ్డం కూడా తక్కువే. ఎందుకో చెప్పలేను కానీ, ఆ ఏమీ తెలీని వయసులో, మౌనంగా, గాలికి ఊగే, ఆ నీలి గోరింట పూలూ, మీ ఆయనా, ఒక్క రీతికి చెందిన వస్తువులే అనుకునేదాన్ని. ఇప్పటికీ, ఎక్కడ ఆ పూలు చూసినా నాకు మీ ఆయన జ్ఞాపకం రాకుండా ఉండదు సావిత్రీ - ఆ పువ్వులున్నంతకాలం మీ ఆయనకూడా నా జ్ఞాపకాల్లో ఉండిపోతాడు"—ఈ మాటలన్నీ వింటున్నంతసేపూ సావిత్రి వెక్కి వెక్కి యేడుస్తూనే ఉంది.

○ ○ ○ ○

"అంతేనా! ఏదో ఎసోసియేషన్ వల్లనైనా నేను నీ గుండెలో బ్రతికుంటానన్న మాట. పోనీ అది మాత్రం ఎంత అదృష్టం కాదు! నేను బ్రతికుండగా నీతో నోరు విప్పి నువ్వంటే నాకేమిటో ఒక్క ముక్కయినా చెప్పలేకపోయాను. అది నా మనసులో సమాధై పోయింది. ఎముకలకు పట్టి యేకాస్తన్నా మిగిలి ఉంటే, ఇంకాసేపటికి అదీ బూడిదై పోతుంది. ఇప్పుడు చెప్పమంటావా! ఈ చెప్పడం నీకు వినపడదని నాకు తెలుసు.

ఆనాడు నువ్వన్నట్లు పధ్నాలుగేళ్ళ ప్రాయంలో ఉన్నా నువ్వు నన్నెంత ఆకర్షించావో నీకు తెలియదు. పావడా జాకెట్టు వేసుకునేదానివి-నీ అందాన్ని నీ శరీరంలో కాదు నేను చూచింది. ప్రతి కదలికలో చూచాను. ఏమీ తోచక చిన్న చిన్న పిల్లల్ని వెంటేసుకుని ఆ జీబు పొదల్లో తిరుగాడుతూ నీలిగోరింట లేరేదానివి. ప్రకృతిలో ఉన్న ప్రతి చిన్న చిన్న అందానికి పరవశిస్తూ స్వేచ్ఛగా నువ్వు కదిపే ప్రతి అడుగూ కిటికీలో నుంచి నిన్ను గమనించే నా గుండెమీద పడుతున్నట్లుండేది. నెల రోజుల తర్వాత ఆ యిల్లు వదలి నువ్వు వెళ్ళావుగాని, నా గుండెను మాత్రం ఖాళీ చెయ్యలేదు. తర్వాత అయిదేళ్ళకు నా తరపున మా బాబయ్య, మీ అమ్మగారితో రాయబారం నడిపారు. అప్పటికి నా చదువు అర్థంతరంగా ఆగిపోయి, చిన్న ఉద్యోగంలో ఇరుక్కున్నాను కాదూ! నువ్వు పై చదువుల్లో మునిగిపోయావు. "అమ్మాయి చదువుకుంటున్నదిగదా అన్నయ్యా ఇప్పుడే దాని పెళ్ళి మాటెందుకు!" అన్నదట మీ అమ్మగారు.

ఆ రోజు నేనెంత కుమిలిపోయానో నీవు ఊహించలేవు. మనసులో నా చదువులేని తనానికీ, చేతగాని తనానికి, దుఖం! నువ్వు నాకు దొరకవని నిస్సహాయత. నువ్వే నాకు అందకపోతే బ్రతుకెందుకని నిరుత్సాహం. నిన్ను నేరుగా అడుగుదామనుకున్నాను. కాని ఎట్లా? ఒకప్పుడైనా నోరు విప్పి నీతో మాట్లాడాను గనుకనా! నేను నలు




గుర్లో కలవలేనివాణ్ణికాదు, పరమ పిరికి వాణ్ణి. ఆ పిరికి తనానికి నా జీవితాన్నే బలిపెట్టుకున్నాను. ఆ రకంగా నా మనసొక అగ్నిగుండమైపోయింది. అందులో నేను పూర్ణాహుతి చెందడం సహజమే. కాని అదుగో ఆ యేడుస్తున్న నా భార్య సావిత్రిని చూచావా - ఆవిడకూడా పూర్తిగా కలతమై మాడిపోయింది. నువ్వే సావిత్రిని ఓదార్చాలి. నువ్వే!"

o o o

ఊరుకో సావిత్రీ! మా అమ్మ కదూ! మీ ఆయనకేం పుణ్యాత్ముడు. నలుగురి చేతా మంచివాడనిపించుకున్నాడు. కుడి చెయ్యెరక్కుండా ఎడమచేతితో దానాలు చేశాడు. ఎందరికో పెళ్ళిళ్లు చేయించి యిళ్ళు నిలబెట్టాడు. పది మందికి ఉద్యోగాలు చూపి అన్నం పెట్టాడు. ఆయన అడుగు జాడల్లో నడిచిన సహన మూర్తివి, మీ ఆయన ఎక్కడికీ పోలేదు సావిత్రీ! నీ గుండెలోనే స్థిరంగా ఉండిపోయాడు.

"మీరన్న మాటలన్నీ నిజమే. కాని చివరి మాట కాదు. ఆయన గుండెలోకి నన్నేనాడూ జొరబడనీయలేదు. ఆయన స్థిరంగా ఉండిపోడానికి ఎన్నుకున్న గుండె నా గుండె కాదని మాత్రం నాకు బాగా తెలుసు. కాని అది ఎవరిదో, ఎక్కడుందో ఎప్పటికీ కనుక్కోలేను" —అని మనసులో అనుకుంటూ కుమిలి కుమిలి యేడ్చింది సావిత్రి.

ఆమె లేచి, శవం పాదాలు ముట్టుకొని నమస్కారంచేసింది. శాశ్వతంగా మూసుకుపోయిన ఆ కళ్ళ వేపు తదేకంగా ఒక్క క్షణం చూచి బయటికి నడిచింది.

బయట రాజుకుంటున్న పిడకల పొగ ఆవిణ్ణి చుట్టు ముట్టగా, ఆవిడ ఆకారం రేకులు కరుగుతున్న నీలి గోరింటలా ఉంది. ★